కొడుకా.. ఎక్కడున్నవ్?

12 ఏళ్ల క్రితం ఉద్యమ బిడ్డ మిస్సింగ్ • జాడ కోసం నిరీక్షిస్తున్న కన్నపేగు..పుట్టిన గడ్డ

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఏడేండ్లు • తెలంగాణ ఉద్యమంలో పాల్గొని మిస్సయ్యాడని కలెక్టర్‌కు రెవెన్యూశాఖ నివేదిక

ఆర్థిక ఇబ్బందుల్లో తల్లిదండ్రులు • చేయూత కోసం ఎదురుచూపులు

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఉప్పందించిన మందల రాజురెడ్డి అకస్మాత్తుగా కనుమరుగైపోయాడు. సాధించుకున్న స్వరాష్ట్రాన్ని చూడలేకపోయాడు. ఎక్కడో ఓ చోట ఉన్నాడనే ఆశతో తల్లిదండ్రులు కాలం గడుపుతున్నారు. ఒక్కగానొక్క కొడుకు పన్నేండేళ్లుగా కనిపించకపోయేసరికి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఏడ్చి ఏడ్చి కళ్లలో నీళ్లు ఇంకిపోయాయి. కాటికి కాలు చాచిన ఆ వృద్ధులు దిక్కులేనివారిగా మిగిలిపోయారు. కూతురికి పెళ్లి చేసి పంపగా .. ఆమే ఆ పండుటాకులను చూసుకుంటున్నది. పన్నేండేళ్లుగా ఆ కూతురు తల్లిదండ్రులను వెంటపెట్టుకుని పోలీస్ స్టేషన్లు, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నది. 2017లో భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏడేళ్లు అవుతున్నా రాజురెడ్డి ఆచూకీ లభించలేదు. రాజురెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాడని, ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన పోరాటాల్లో పాల్గొన్నాడని, అనంతరం అతను కనిపించకుండా పోయాడని విచారణ జరిపిన తహసీల్దార్, ఆర్డీవో జిల్లా కలెక్టర్, ఎస్పీకి నివేదిక ఇచ్చారు. ప్రస్తుతం రాజురెడ్డి తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధ పడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తూ చేయూత కోసం ఎదురు చూస్తున్నారు.

మందల రాజురెడ్డి (ఫైల్)

ఉద్యమం నుంచే కనుమరుగు

మందల రాజురెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో పదో తరగతి, హనుమకొండలో ఇంటర్, హైదరాబాద్‌లోని ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ప్రైవేటు కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. ఉస్మానియా కళాశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ఉద్యమానికి అండగా నిలిచాడు. 2012 నుంచి రాజురెడ్డి ఆచూకీ కరువైంది. రాజురెడ్డి కూతురు మమత తల్లిదండ్రులతో కలిసి 2017 జూన్ 20న భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూపాలపల్లి పోలీసులు ఈ కేసును ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడి పోలీసులు విచారణ జరిపి రాజురెడ్డి ఆచూకీ లభించడం లేదని 2021 నవంబర్ 10న సర్టిఫికెట్ ఇచ్చారు.

ఆర్డీవో నివేదిక ఇచ్చినా....

రాజురెడ్డి అదృశ్యంపై తల్లిదండ్రులు మందల చిన్న సమ్మిరెడ్డి, సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూపాలపల్లి తహసీల్దార్ ఇక్బాల్ విచారణ జరిపి ఆర్డీవో శ్రీనివాస్‌కు నివేదిక ఇచ్చారు. అనంతరం విచారణ జరిపిన ఆర్డీవో 2012 జూన్ 6 నుంచి రాజురెడ్డి కనిపించడం లేదని, తల్లిదండ్రులు కొడుకు జాడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు, ఎస్పీ సురేందర్‌రెడ్డికి నివేదిక సమర్పించారు. ఇదే విషయమై కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. కొడుకు పన్నెండేళ్లుగా కనిపించడం లేదని, ఉద్యమంలో మృతి చెందాడా.. లేక ఏమయ్యాడో ఆచూకీ చెప్పాలని తల్లిదండ్రులు కోరగా ఎలాంటి సమాచారం లేదని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు లేఖ ఇచ్చారు. కొడుకు డెత్ సర్టిఫికెట్ అయినా ఇవ్వాలని కోరగా భూపాలపల్లి పోలీసులు ఉస్మానియా పోలీసులపైనా, ఉస్మానియా పోలీసులు భూపాలపల్లి పోలీసులపై కేసును నెట్టేస్తూ జాప్యం చేస్తున్నారని రాజురెడ్డి తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

రాజురెడ్డి తల్లిదండ్రులు చిన్న సమ్మిరెడ్డి, సుమతి

ప్రత్యేక చొరవ చూపిన బీఆర్ఎస్

మందల రాజురెడ్డి ఉద్యమ కాలంలో మిస్సింగ్ విషయమై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. రాజురెడ్డి ఆచూకీ విషయమై నాటి మంత్రి కేటీఆర్ జిల్లా ఉన్నతాధికారులను నివేదిక కోసం ఆదేశించారు. తెలంగాణ అమరవీరులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10 లక్షలతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించిన విషయం తెలిసిందే. రాజురెడ్డికి డెత్ సర్టిఫికెట్ లేకపోవడంతో కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందలేదు. ఒక వ్యక్తి ఏడేళ్లు మిస్సింగ్‌లో ఉంటే మృతి చెందినట్టుగా భావించి డెత్ సర్టిఫికెట్ ఇవ్వవచ్చని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని, ఈక్రమంలో రాజురెడ్డి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసుకు ఏడేళ్లు కాగా.. డెత్ సర్టిఫికెట్ ఇవ్వొచ్చని న్యాయవాదులు చెబుతున్నారు. ఆర్డీవో విచారణలో సైతం రాజురెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అదృశ్యమయ్యాడని నివేదిక ఇచ్చారని , డెత్ సర్టిఫికెట్ ఇచ్చి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వొచ్చని వారు సూచిస్తున్నారు.

మాకు దిక్కెవ్వరు..?

12 ఏళ్లుగా కొడుకు కోసం కళ్లలో ఒత్తులు పెట్టుకుని ఎదురు చూస్తున్నం. రాజురెడ్డిని టీవీల్లో చూసుకునేటోళ్లం. తెలంగాణ కోసం కోట్లాడే వాళ్లలో నా కొడుకు ఉండే. ఎన్నిసార్లు వద్దన్నా ఇనలే. మాకు ఒక కొడుకు, ఒక కూతురు. 12 ఏళ్లు దాటింది కొడుకును చూడక. బతికున్నడా.. చనిపోయిండో తెలువదు. బిడ్డను వెంట పెట్టుకుని హైదరాబాద్ అంతా తిరిగినం. మా ఊరిలో ఉన్న వాసుదేవరెడ్డితో బీఆర్ఎస్ నేత కేటీఆర్, గత ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని కలిసినం. డెత్ సర్టిఫికెట్ ఇప్పించి న్యాయం చేస్తామని చెప్పారు. అంతలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయింది. మా ఆయనకు పక్షవాతం, నాకు క్లీళ్లవాతం. ఆర్థికంగా చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. అప్పు చేసి బిడ్డ పెళ్లి చేసినం. అద్దె ఇంట్లో బతుకుతున్నాం. ప్రభుత్వం న్యాయం చేయాలి.

- మందల సుమతి. రాజురెడ్డి తల్లి

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. పక్కన మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్

కాల్వలు తవ్వాలంటే గతాన్ని తవ్వుతున్నరు!

- మీ ఏడాది పాలనపై రెఫరెండానికి సిద్ధమా?
- దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలవండి?
- మంత్రి జూపల్లికి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సవాల్

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కాల్వలు తవ్వమంటే కాంగ్రెస్ నేతలు గతాన్ని తవ్వుతున్నారని, తెలంగాణ సాగునీటి రంగంలో కాంగ్రెస్ పాపాలు తవ్వితే పుట్టల నుంచి పాములు వచ్చినట్టు వస్తాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ఏ పనీ చేయలేదని అన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో గెలవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు శ్రీనివాస్‌గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలోని రైతులకు 100% రుణమాఫీ అయినట్టు 33 జిల్లాల కలెక్టర్లతో డిక్లరేషన్లు ఇప్పిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయబోదని స్పష్టంచేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రైతులు, పాలమూరు జిల్లా పరిస్థితి ఏమిటి? ఇప్పుడు ఏమిటి? అనే దానిపైనా చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. బ్రిజేశ్ ట్రిబ్యునల్ తాజా మధ్యంతర ఉత్తర్వులు ముమ్మాటికీ కేసీఆర్ ఘనతేని చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని శ్రీనివాస్‌గౌడ్ హితవు పలికారు. పాలమూరు వెనకబడటానికి ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ నేతల పాపం కాదా? పాలమూరు నుంచి వలసలు తగ్గించింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వం ప్రాజెక్టులను అనుమతి లేకుండా అక్రమంగా శరవేగంగా పూర్తిచేస్తుంటే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు.



చేర్యాలలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రైతులను నిండా ముంచిన కాంగ్రెస్

హామీలన్నీ అమలు చేయాల్సిందే • జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 18 : రైతులతో పాటు అన్నివర్గాలను కాంగ్రెస్ సర్కారు నిండా ముంచిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మార్కెట్ యార్డులో శనివారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వలేదని, 2లక్షల వరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ప్రతి రైతుకు రూ.15వేల రైతు భరోసా ఇవ్వాలని, ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంది పంటను నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సూచించారు.

చేర్యాలలో ప్రొటోకాల్ ఉల్లంఘన

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో హైడ్రామా చోటుచేసుకుంది. కందుల కొనులు కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించాల్సి ఉంది. కాగా ఎమ్మెల్యే రాకముందే డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే పల్లా చేర్యాల మార్కెట్‌యార్డుకు వస్తున్నారని తెలుసుకున్న అధికారులు హుటాహుటిన తిరిగి రిబ్బన్ ఏర్పాటు చేసి కొబ్బరికాయలు తీసుకువచ్చి కేంద్రం ఏర్పాటుకు ఏర్పాట్లు చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘించి కాంగ్రెస్ నాయకులు అప్పటికే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులు, కాంగ్రెస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి

- హైదరాబాద్‌లో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- అధికారికంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది
- కానీ, ఇప్పటివరకు ఒక్క కార్యక్రమమూ నిర్వహించలె
- మంత్రి జూపల్లికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ పోరాటానికి జవసత్వాలు నింపిన ప్రజాకవి, పీడనపై 'అగ్నిధార'ను కురిపించిన రుధిరధార దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు శనివారం ఆమె లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఒక ప్రధాన కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని సూచించారు. దాశరథి జన్మించిన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు గ్రామంలో స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాంతో పాటు గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న దాశరథి గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని ప్రతిపాదించారు. దాశరథి సమగ్ర సాహిత్యాన్ని ప్రభుత్వమే ముద్రించి గ్రంథాలయాల్లో అందరికీ అందుబాటులోకి తేవాలని కోరారు.

ప్రకటనలకే పరిమితం

దాశరథి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం పక్షాన అధికారికంగా సంవత్సరం పొడవునా నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, కానీ ఆ దిశగా పెద్దగా కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. దాశరథి శతజయంతి సంవత్సరం సందర్భంగా ఏడాది పొడవునా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు విస్తృతంగా జరపాలని, శతజయంతి ఉత్సవాల ముగింపు వేడుకలను పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పెద్ద ఎత్తున జరపాలని కోరారు. దాశరథిని ఉంచిన నిజామాబాద్ జిల్లా పాత జైలును ఇప్పటికే తాము కొంత నిధులను వెచ్చించామని, దాశరథి స్మారక ప్రాంగణం ఏర్పాటుకు పనులు చేపట్టామని, దాన్ని అందరికీ అందుబాటులోకి తేవడానికి అవసరమైన మరమ్మతులు చేసి, మరిన్ని వసతులు కల్పించి ప్రముఖ పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

సాహితీమూర్తులకు తగిన సత్కారం

మహాకవి దాశరథి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలంగాణ తొలి ప్రభుత్వం 2015 నుంచి దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహించటమే కాకుండా దాశరథి సాహితీ పురస్కారాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ సాహితీమూర్తులను సత్కరించి, వారికి రూ.1,01,116 నగదును అందించిన విషయాన్ని కవిత గుర్తుచేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని ఆడిటోరియానికి దాశరథి పేరు పెట్టడంతో పాటు మహాకవి కుటుంబానికి అండగా నిలిచేందుకు వారి కుమారుడికి గత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చిందని వివరించారు.

భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా

'తెలంగాణ విముక్తి పోరులో ప్రజల పక్షాన నిలవడమే కాక అనేక రచనా ప్రక్రియల్లో సాహితీ సృష్టి చేసిన సృజనకారులు దాశరథి. ఈ నేల అస్మితను ఆకాశమంత ఎత్తున నిలిపిన ఆ మహనీయుని శత జయంతి ఉత్సవాలు తెలంగాణ తన మూలాలను నెమరువేసుకునే చారిత్రక సందర్భం. దాశరథి స్ఫూర్తిని ముందుతరాలకు చాటే దిశగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తమరిని సవినయంగా కోరుతున్నాను' అని మంత్రి జూపల్లికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. 'కవిత్వం, నాటికలు, కథలు, యాత్రా చరిత్ర వంటి ప్రక్రియలతో తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన మహాకవి దాశరథి. అద్భుతమైన సినిమా పాటల రచయితగా జోతలందుకున్న తెలంగాణ బిడ్డ దాశరథి కృష్ణమాచార్యులు. వారి శత జయంతి తెలంగాణ ప్రజలందరికీ పెద్ద పండుగ. ఈ శత జయంతి సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించడం ప్రభుత్వ విద్యుక్త ధర్మం' అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

కాంగ్రెస్‌కే దొంగ దీక్షలు అలవాటు

- షాబాద్‌లో రైతు దీక్ష విజయవంతం
- జీర్ణించుకోలేక కాంగ్రెస్ నేతల అక్కసు
- బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకే దొంగదీక్షలు అలవాటు అని, తమకు ఆ ఖర్మ పట్టలేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్న రైతు దీక్ష తాము ఊహించిన దానికన్నా ఎక్కువ విజయవంతమైందని తెలిపారు. ఇది జీర్ణించుకోలేకే కాంగ్రెస్ నేతలు కేటీఆర్‌పై నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం మెడలు వంచేందుకు రైతుదీక్ష చేపట్టినట్టు చెప్పారు. ప్రజా సమస్యలపై ముందుండి పోరాడుతున్నందుకు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టారని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసి చూపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీల అమలుపై రేవంత్‌రెడ్డితో చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు.

పెన్నా సిమెంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల ముందస్తు అరెస్టు

దామరచర్ల, జనవరి 18 : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం గణేశ్‌పాడులోని పెన్నాసిమెంటు కర్మాగారాన్ని అదానీ గ్రూప్ కొనుగోలు చేసి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ భారీ పోలీసు బందోబస్తు మధ్య సాగింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, పెన్నా సిమెంటు కర్మాగార ప్రభావిత గ్రామాల్లోని సామాజిక కార్యకర్తలు, బీఆర్ఎస్, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సిమెంటు కర్మాగారం కింద 354.236 హెక్టార్ల మైనింగ్ లీజు ఉండగా అందులో దామరచర్ల మండలం గణేశ్‌పాడులో 303.664 హెక్టార్లు, సూర్యాపేట జిల్లా శూన్యంపాడులో 50.572 హెక్టార్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.5 ఎమ్‌టీపీని 1.8కి పెంచుకునేందుకు రెండు జిల్లాలకు వేర్వేరుగా ప్రజాభిప్రాయాలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిర్వహించారు. ఎన్జీవోలు మాట్లాడుతూ పరిశ్రమతో మూసీ నది కలుషితం అవుతుందని, పంటలు, ఆరోగ్యం దెబ్బతింటాయని పేర్కొన్నారు. కాలుష్యం నివారణ చర్యలు చేపట్టాలని, ప్రభావిత గ్రామాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణలో భాగంగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటారనే అనుమానంతో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రశ్నిస్తారనే భయంతోనే ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడాలి

- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి
- ప్రజాచైతన్య బస్సు యాత్ర ప్రారంభం

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల చైతన్యమే లక్ష్యంగా చేపట్టిన ప్రజాచైతన్య బస్సుయాత్రను గన్‌పార్క్ వద్ద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కువ మంది కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ఆదుకునేలా ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. శివ, బ్రహ్మ, నారాయణ, రాములు, వెంకటయ్య, పుష్పలత పాల్గొన్నారు.

కులాల పేర్ల మార్పుపై 500 విజ్ఞప్తులు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): బీసీ జాబితాలోని 8 కులాలకు చెందిన పేర్లలో మార్పులపై బీసీ కమిషన్‌కు 500లకు పైగా విజ్ఞప్తులు వచ్చాయని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ కులాల పేర్లను దూషణలకు వాడుతున్నారని దొమ్మర, పిచ్చుకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, కుమ్మర, చాకలి, చిప్పోలు, వీరముష్టి కులాల ప్రతినిధులు బీసీ కమిషన్‌ను అభ్యర్థించారు. అభ్యంతరాల స్వీకరణకు గడువు ముగియగా 500కు పైగా విజ్ఞప్తులు వచ్చినట్టు నిరంజన్ తెలిపారు.

బీసీలకు 'ఎమ్మెల్సీ' ఇవ్వకుంటే కాంగ్రెస్ సమాధి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల హెచ్చరిక

ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఖైరతాబాద్, జనవరి 18 : వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు అవకాశం ఇవ్వాలని, లేకుంటే ఆ పార్టీకి సమాధి కడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలపై కాంగ్రెస్ వైఖరిని ఖండించారు. త్వరలోనే వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ, కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల, కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో అధిక శాతం జనాభా ఉన్న బీసీలకే ఆయా ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం జరిగితే తమ అభ్యర్థులను ఇండిపెండెంట్‌గా నిలబెట్టి గెలిపించుకుంటామని వెల్లడించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కుందారం గణేశ్‌చారి, బాలరాజు గౌడ్, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు తేల్చాకే 'స్థానిక' ఎన్నికలు జరపాలి

- బీసీ కమిషన్‌కు తెలంగాణ బీసీ హక్కుల వేదిక వినతి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్లను తేల్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, ఆ మేరకు ప్రభుత్వానికి సూచించాలని తెలంగాణ బీసీ హక్కుల వేదిక కోరింది. ఈ మేరకు సంస్థ కన్వీనర్ కాంభోజీ వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్ బైరోజు వెంకటాచారి రాష్ట్ర బీసీ కమిషన్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. దశాబ్దాలుగా బీసీలను దూరం పెడుతున్నారని ఆవేదన చెందారు. గ్రామాల్లో సంచార జాతులు, సేవా కులాలు ఇప్పటికే నిర్వీర్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన సర్వేలో అర్బనైజేషన్‌ను పరిగణనలోకి తీసుకున్నారని, అది సహేతుకం కాదని, బీసీ కమిషనే సర్వే చేయాలని కోరారు. ప్రస్తుతం జాబితాల్లో ఉన్న కులాల పేర్లలో మార్పులు చేయాలని కోరారు.

ఏడాదంతా ఎన్నికలకు ప్లాన్!

- 'కోడ్' మాటున కాలం గడిపేయాలని ప్రభుత్వం ఎత్తుగడ
- జనవరి 26 తర్వాత కొత్త పథకాలూ లేనట్టే
- ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణా కష్టమే

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదంతా వరుస ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. తద్వారా సంవత్సరం మొత్తం 'ఎన్నికల కోడ్' నీడలో గడిపేయాలని ప్రణాళికలు రచించినట్టు చెప్తున్నారు. తద్వారా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలును దాదాపు ఏడాదిపాటు వాయిదా వేయవచ్చని కాంగ్రెస్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. ఈ నెల 26వ తేదీన ప్రభుత్వం 4 పథకాలను ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. రైతు భరోసా, రైతు కూలీలకు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల ప్రారంభోత్సవానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఆ తర్వాత వరుసగా ఎన్నికలకు వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించింది. దీంతో ఈ ఏడాది ఇవే కొత్త పథకాలని, మరే సంక్షేమ పథకాలు అమలుకాకపోవచ్చని విశ్లేషకులు చెప్తున్నారు.

ఎమ్మెల్సీ నుంచి మున్సిపాలిటీ వరకు..

ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు పెండింగ్ ఉన్నాయి. నిరుడు ఫిబ్రవరి నుంచి ప్ర